

# పేరూరు ఎత్తిపోతలు ఇప్పట్లో లేనట్లే ..?



**భూసేకరణ దగ్గరే ఆగిన పనులు**

**భూసేకరణ పూర్తవ్వాలంటే రూ.50.73 కోట్లు అవసరం**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

హంద్రీనీవా రెండో దశ కిందనున్న పేరూరు ఎత్తిపోతల పథకం పనులు గడిచిన మూడేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. 2019లో వైసిపి అధికారంలోకి వస్తూనే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని అప్పటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ చెన్నేకొత్తపల్లి మండలంలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ప్రకటించారు. కాని అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు మాత్రం ఎక్కడివక్కడే ఆగిపోయాయి.

**రివర్సు టెండరింగులో మూడు రిజర్వాయర్లు పెంచినా ...**

పేరూరు ఎత్తిపోతల పథకం ద్వారా జీడిపల్లి నుంచి పేరూరు డ్యామ్‌కు నీటిని అందించే పనులను తెలుగుదేశం ప్రభుత్వ హయంలో రూ.803.967 కోట్లతో చేపట్టారు. రూ.113.33 కోట్లు అప్పటికే వెచ్చించారు. అయితే ఈ పనుల్లో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వైసిపి అధికారంలోకి వచ్చాక రివర్సు టెండరుకు వెళ్లాలని కొంతకాలం పనులను ఆపింది. ఆ తరువాత రివర్సు టెండరింగు కాకుండా పథకంలో మార్పులు చేసింది. సోమరవాండ్లపల్లి, తోపుదుర్తి, ముట్టాల, దేవరకొండ జలాశయాలను నిర్మించి లక్ష ఎకరాలకు నీటిని అందివ్వాలని నిర్ణయిస్తూ కొత్త ఉత్తర్వులిచ్చింది. అదే మొత్తంతో మరో మూడు కొత్త రిజర్వాయర్లు చేపడుతున్నామని ప్రకటించడమే కాకుండా ఈ నాలుగేళ్ల కాలంలో పూర్తి చేస్తామని చెన్నేకొత్తపల్లి సభలో ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. కాని ఇప్పటికీ పనుల్లో ఎక్కడా పురోగతి కనిపించడం లేదు.

**భూసేకరణకు వెలువడని నిధులు**

భైరవానితిప్ప ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇటీవల నిధులను విడుదల చేశారు.ఈ మేరకు ఆ ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందింది. కాని పేరూరు ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న రైతులకు ఇప్పటికీ పరిహారం అందలేదు. ఈ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 988.66 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉంది. ఆనాటి అంచనాల ప్రకారమే రూ.55.922 కోట్లు నిధులు అవసరమవుతాయి. అయితే ఇప్పటి వరకు చూస్తే 95.16 ఎకరాలు మాత్రమే భూసేకరణ జరిగింది. ఇంకా 893.50 ఎకరాలు భూసేకరణ జరగాల్సి ఉంది. రూ.50.73 కోట్లు నిధులు దీనికి అవసరమవుతాయి.

**మరో మూడేళ్లు సమయం అవసరమంటున్న అధికారపార్టీ నేతలు**

ఈ ప్రాజెక్టును ఈ నాలుగేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి ఇప్పుడు సాధ్యం కాదని అంటున్నారు. నిధుల లేమితో ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను ప్రభుత్వం చేపడుతోందన్నారు. పేరూరు ఎత్తిపోతల పథకాన్ని మరో మూడేళ్లలో పూర్తి చేసే అవకాశముందని శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. దీన్ని బట్టి పేరూరు ఎత్తిపోతల పథకం పనులు ఇప్పట్లో పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదన్నది స్పష్టమవుతోంది.

# పుంగనూరు ఘటనకు చంద్రబాబే కారణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**నిర్దేశిత మార్గం మార్చడంతోనే ఉద్రిక్తత**

**ప్రణాళిక ప్రకారమే పోలీసులపై దాడి**

**విద్యుత్, అటవీ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

పుంగనూరులో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడానికి ప్రధాన కారణం టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడే అనివిద్యుత్, అటవీ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. ముందుగానే ప్రణాళిక ప్రకారం తుపాకులు, రాళ్లు తెచ్చుకుని దాడులకు పాల్పడ్డారన్నారు. అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం అనంతపురం వచ్చారు. ఈసందర్భంగా రెవెన్యూ భవనంలో కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీ ఉనికిని కోల్పోయిందని విమర్శించారు. ఈ భయంతోనే చంద్రబాబునాయుడు ఉద్దేశ్యపూర్తకంగా ఘర్షణకు తెరలేపారని ఆరోపించారు. ముందురోజు చంద్రబాబు తీసుకున్న రోడ్డు మ్యాప్ ప్రకారం పుంగనూరు టౌన్‌లో పర్యటన లేదని చెప్పారు. కాని చివరి నిమిషంలో వెళ్లే ప్రయత్నం చేస్తుండగా భద్రతా కారణాల రిత్య పోలీసులు ముందుకెళ్లవద్దని చెబితే వారిపై తుపాకులు, రాళ్లు, కర్రలు తెచ్చుకుని దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. అక్కడికీ పోలీసులు సంయమనంతో వ్యవహరించారన్నారు. ఈ దాడిలో అనేక మంది పోలీసులకు దెబ్బలు తగిలాయని చెప్పారు. ప్రజల పట్ల నమ్మకం సడలే చంద్రబాబు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆయన మొదడు కూడా మందగించిందని ఎద్దేవా చేశారు. రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ పనులు చేపడుతున్నది ఎన్‌సిసి సంస్థ అని చెప్పారని అది ఇంకా పనులే ప్రారంభించలేదని అన్నారు. అందులో డబ్బంతా తనకిచ్చారని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నీచ రాజకీయాలు చేయడం చంద్రబాబుకు ముందు నుంచే అలవాటని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్య, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్షల్లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

# స్పందించకపోతే 19 నుంచి నిరవధిక సమ్మె

**సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు**

**ఐదో రోజుకు ఆర్‌డబ్ల్యుఎస్ కార్మికుల దీక్షలు**

**సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఉషాశ్రీచరణ్‌కు వినతి**

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 19 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు హెచ్చరించారు. బకాయి వేతనాలు చెల్లించాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీరామిరెడ్డి, శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా పథకం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హాజరయ్యారు. జిల్లా పర్యటనకు వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి ఉషాశ్రీచరణ్ కలెక్టరేట్‌లో సమావేశానికి హాజరైన సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని విన్నవించేందుకు కలెక్టరేట్ వద్దకు వెళ్లారు. పోలీసులు కలెక్టరేట్‌లో మంత్రులు సమావేశంలో ఉన్నారని చెప్పడంతో గేటు ముందు బైటాయించి నిరసన తెలిపారు. మంత్రి కలిసేందుకు అనుమతించాలని నాయకులు డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు సంబంధిత అధికారులకు ఫోన్ చేయగా అనుమతించాలని వారు ఆదేశించడంతో పోలీసులు లోపలికి అనుమతించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్‌ను నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతరం జిల్లాలో శ్రీ సత్య సాయి, శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో 557 మంది కార్మికులు 2000 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం తక్కువ గౌరవేతరం ఇస్తూ పని చేయిస్తోందన్నారు. ఇచ్చే అరకొర గౌరవ వేతనం కూడా నెలలు తరబడి బకాయి పెట్టారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన సమయంలో కార్మికులు నిరసన సమ్మెలు చేపట్టారన్నారు. తమ సమస్యలు సీఎంకు వివరిస్తే సమస్య పరిష్కారం లభిస్తుందని ఆశించామన్నారు. అయితే జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి స్పందించి నాలుగు రోజుల్లోగా బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని రూ. 32 కోట్లు నిధులు మంజూరు కానున్నాయని హామీ ఇచ్చి సమ్మె విరమింపజేశారని గుర్తు చేశారు. అయితే ఇది జరిగి 20 రోజులు గడిచిన కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించలేదన్నారు. ప్రభుత్వం నుంచి బిల్లు సంబంధిత ఫైనాన్స్ సెక్రటరీ దగ్గర ఆగినట్లు తెలిసిందన్నారు. స్పందించి రూ. 32 కోట్లు విడుదల చేసి కార్మికులకు చెల్లించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ఈ నెల 19వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో వెళుతున్నట్టు మంత్రికి నాయకులు వివరించారు. స్పందించిన మంత్రి సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు దీక్ష శిబిరంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటమే మార్గమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తోందన్నారు. అదాని అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. భవిష్యత్తులో చట్టాలను మార్చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం చర్యలను వ్యతిరేకించాల్సిన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు మోడీకి మోకరిల్లుతుండడం శోచనీయంగా ఉందన్నారు. ఇలాంటి ప్రభుత్వాలను ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాగునీటి పథకం కార్మికుల యూనియన్ నాయకులు నాగరాజు, లక్ష్మిరెడ్డి, ఎం.నాగరాజు, శ్రీనివాసులు, తిరుపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

**ప్రజాశక్తి-అనంతపురంసిటీ**



విద్యార్థుల స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న డిఇఒ సాయిరం

సమగ్ర శిక్ష ఐఇడి విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను డిఇఒ ఎం.సాయిరామ్ ప్రారంభించారు. ఇందులో భాగంగా 50 మీటర్లు ,100 మీటర్లు రన్నింగ్ పోటీలు, షాట్‌పుట్, లాంగ్‌జంప్, బోసి గేమ్, స్లో వాక్ తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డివైఇఒ పద్మప్రియ, ఎంఇఒ-2 సరితాదేవి, అసిస్టెంట్ ఐఇడి కో-ఆర్డినేటర్ షమా, మండల ఐఇడి కో-ఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు రక్షణ కల్పించాలి

**చర్చా వేదికలో వక్తలు**

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

దేశంలో రాష్ట్రంలో దళితులకు రక్షణ కల్పించి, వారి సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పలు ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, వ్యవసాయ కార్యదర్శి జిల్లా అధ్యక్షులు సూరి అధ్యక్షతన శనివారం దళితుల రక్షణ, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జెవివి జిల్లా కార్యాలయంలో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దళితుల స్థితిగతులు చాలా దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయని తెలిపారు. పాలనా పరంగా రెండు జిల్లాలుగా విడిపోయిన తర్వాత జిల్లాలో జనాభా 2.75 లక్షలు ఉన్నారని, దళితులకు సగటున కేవలం 1.0 ఎకరం కూడా లేదన్నారు. ఎక్కువ మంది రెక్కల కష్టంపై వలస జీవులుగా ఎక్కడ పని దొరికితే అక్కడకి వెళ్ళి బ్రతకాల్సి వస్తోందన్నారు. దీనికి తోడు కుల వివక్షత, అంటరానితనంకు, దాడులు, హత్యలు, మానభంగాలకు గురువుతున్న వారు కూడా దళిత, గిరిజనులే అన్నారు. సంక్షేమ పథకాలకు ఇస్తున్న నిధులు తగ్గిస్తూ దారి మళ్ళించడం పెరిగిందన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా దళిత రక్షణ యాత్రను రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిర్వహిస్తున్నాయని, అందులో భాగంగా చార్టర్ ఆఫ్ డిమాండ్లను రూపొందించేందుకు చర్చా వేదికను నిర్వహించామన్నారు. 26 చార్టర్ ఆఫ్ డిమాండ్స్‌తో దళిత రక్షణ యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 9న క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కుల రక్కసి, క్విట్ మతోన్మాదం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి, మాల మహానాడు జిల్లా నాయకులు గడ్డం ముత్యాలు, ఎస్సి జన సంఘం నాయకులు దాసగాని కుల్లాయప్ప, మాజీ విజిలెన్స్ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, ఎస్సీ ఎస్టీ సమాఖ్య నాయకులు సాంబ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి రామయ్య, ఉరుముల కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు యూ.సోమశేఖర్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తులసమ్మ, నాగరాజు, అక్కులప్ప, శివ, నల్లప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



చర్చా వేదికలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప

# సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారాలు

**జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**




సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ప్రజా సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారాలను చూపేలా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో కళ్యాణదుర్గం, గుంతకల్ నియోజకవర్గాల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎమ్.గౌతమి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారితో పాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎడిసిసి బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత, డిసిఎంఎస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గాల సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలకున్న ఇబ్బందులు, కొత్త పనుల మంజూరు, ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిచేందుకు, పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంతకు ముందు జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం సమీక్ష నిర్వహించామని తెలిపారు. శనివారం కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల సమీక్షలను నిర్వహించామని తెలిపారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి వచ్చిన వినతులను పరిశీలించి జిల్లా కలెక్టర్ స్థాయిలో మంజూరు చేయాల్సినవి చేయిస్తామన్నారు. రాబోయే రెండు వారాల్లో మిగిలిన నియోజకవర్గాల సమీక్షలను కూడా పూర్తి చేస్తామని, జిల్లాలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారాలను చూపించడం జరుగుతుందని అన్నారు. ఆయా నియోజకవర్గ సమీక్షలలో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న సమస్యలు, రెండు మూడు నెలల్లో పూర్తి చేసే పనులు, ప్రభుత్వం పరంగా నిధులు సమకూర్చే పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేలకు అన్ని విధాల సహకారం అందించాలన్నారు. ప్రభుత్వం 'గడపగడపకు మీ ప్రభుత్వం' 'జగనన్న సురక్ష' వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, సమాజానికి ఉత్తమ సేవలను అందించడానికి వీలు కలిగిందన్నారు. కళ్యాణదుర్గం పరిధిలో బలిజ భవన్‌ను వెంటనే పూర్తి చేయడానికి అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలన్నారు. బోరంపల్లిలో సబ్ స్టేషన్ నిర్మాణం కోసం భూమిని సేకరించి పనులు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక భవన నిర్మాణాలకు సంబంధించి పురోగతి తక్కువగా ఉందని, నాసిరకంగా పూర్తి చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను కంబదూరులో రూర్బన్ స్కీం కింద రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ పరిధిలో ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేదని, నిర్మాణంలో ఉన్న ఇళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులుఉషాశ్రీచరణ్ మాట్లాడుతూ కళ్యాణదుర్గం పట్టణానికి పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలన్నారు. రూర్బన్ స్కీం కింద కందుకూరు మండల కేంద్రంలో సిసి రోడ్లు మధ్యలోనే ఆగిపోయాయని, మరో రూ.50 లక్షలు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని అన్నారు. హౌసింగ్ సంబంధించి నియోజకవర్గంలో ఎన్ని సార్లు సమీక్ష చేసుకున్న ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేదని, వెంటనే పురోగతి చూపించాలని ఆదేశించారు. జల్లిపల్లిలో ముంపునకు గురైన వారిలో అర్హులైన వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలన్నారు. కంబదూరు ముస్లిం కాలనీలో అవసరమైన భూమిని గుర్తించి అర్హులైన వారికి ఇళ్ల పట్టాల అందించాలన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బోరంపల్లి సబ్‌స్టేషన్ చాలా ముఖ్యమని, రైతులు ఇబ్బందులు పడకుండా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మైనార్టీ సంక్షేమం కింద ఈద్గా నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలని, అంబేద్కర్ భవన్ నిర్మాణం చేపట్టాలని చెప్పారు. నియోజకవర్గంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, తదితర ప్రాధాన్యత భవనాల పనుల్లో పురోగతి చూపించాలన్నారు. వైఎస్‌ఆర్ జలకళలో భాగంగా అర్హులైన రైతులందరికి బోర్లు వేయించాలన్నారు. అనంతపురం ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి గడువులోపు నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ ఎమ్.గౌతమి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాలపై కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాలకు సంబంధించి శాఖల వారీగా సమీక్ష నిర్వహించామన్నారు. ఆయా శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేసి అభివద్ధి పనుల్లో పురోగతి తీసుకురావాలన్నారు. గుంతకల్ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గుంతకల్ నియోజకవర్గంలో సంతప్తికర స్థాయిలో అభివద్ధి పనులు జరిగాయన్నారు. పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ఈ సమీక్షలలో సిపిఒ ప్రశాంత్ కుమార్, గుంతకల్ ఆర్‌డిఒ రవీంద్ర, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రూప్లా నాయక్, పీఆర్ ఎస్ఇ భాగ్యరాజ్, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీ సిఈవో భాస్కర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఎపిఎస్పీడీసిఎల్ ఎస్ఇ సురేంద్ర, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఇ ఇషాన్ బాషా, డీపీవో ప్రభాకర్ రావు, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిఇఒ సాయిరాం, డిఎంహెచ్ఒ యుగంధర్, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఫిషరీస్ డీడీ శాంతి, ఆర్అండ్‌బి ఎస్ఇ ఓబుల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# సిరుల సీమగా మారేదెన్నడో..?

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే నీటి వసతి ప్రధానమైంది. అది పుష్కలంగా ఉన్న ప్రాంతాలే అభివృద్ధి మార్గంలో పయనిస్తాయనేది నిపుణుల మాట. అయితే దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగిన రెండో ప్రాంతంగా ఉమ్మడి అనంతపురం జిల్లా ఉంది. గత పది సంవత్సరాల కాలం తీసుకుంటే ఏడేనిమిది సంవత్సరాలు కరులే ఉంటాయి. సగటు వర్షపాతం 522 మిల్లిమీటర్లలోపే ఉంటుంది. ఇంత తక్కువ వర్షపాతమున్న చోట సాగునీటి వసతి అయినా ఉందా.. అంటే అదీ లేకుండా ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లా సాగు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు అంచనా వేస్తూ కనీసం వంద టిఎంసిలకుపైగానైనా నీరు అవసరమవుతుందని నిపుణులు చెబుతుంటారు. వంద టిఎంసిలకు జిల్లాకు కావాలన్న డిమాండ్‌ను రైతు, ప్రజా సంఘాలు ఎప్పుడూ చేస్తూనే ఉంటాయి. ఈ జిల్లాకున్న ప్రధానమైన నది పెన్నానది. ఈ నది పేరుకేగాని మొత్తం ప్రవహించేంత నీరు మాత్రం దశాబ్దాల్లో ఒక్కసారి మాత్రమే చూడగలిగే పరిస్థితి. ఇక నిఖరంగా ఈ జిల్లాకు వచ్చే నీరు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నుంచే. ఈ ప్రాజెక్టు నుంచి 32.50 టిఎంసిలు కేటాయింపులున్నాయి. అయితే తుంగభద్రలో పూడిక, కాలువలు సరిగా లేకపోవడం వంటి వాటితో దీనికి సగటున 23.50 టిఎంసిలు మాత్రమే జిల్లాకు వస్తోంది. దీనికి అదనం




రెండు,మూడు టిఎంసిలు కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా వచ్చేవి ఉంటాయి. ఈ నీరు తీసుకోవాలంటే కూడా జిల్లా సరిహద్దుల్లో నుంచి ఆగిపోయిన తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు ఇబ్బందికరంగా మారాయి. 2008లో ప్రారంభమైన ఈ పనులు 2019 వరకైనా పూర్తవలేదు. రెండు దశబ్దాల్లో పనులు పూర్తవకపోగా ఉన్న పనులను 2019 తరువాత వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో తుంగభద్ర డ్యామ్‌లో నీరు పుష్కలంగా ఉన్నా నీటిని అందిపుచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. హంద్రీనీవా కొనసాగుతూ ఉన్న ప్రాజెక్టుగా మారిపోయింది. 2006లో ప్రారంభమైన ప్రాజెక్టు ఇప్పటికీ అనుకున్న లక్ష్యం ప్రకారం పనులు పూర్తవలేదు. అనేక రైతు, ప్రజా సంఘాల పోరాట ఫలితంగా ఈ ప్రాజెక్టు వచ్చింది. అయితే దీన్ని సొంతం చేసుకునేందుకు అటు వైసిపి, టిడిపిలు పోటీ పడుతున్నాయి. ఈ క్రమంలోనే టిడిపి అధ్యక్షులు ఇటీవల సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా పర్యటన చేశారు. ఈవారంలో ఆయన అనంతపురం జిల్లాలో సాగించిన యాత్రతో పొలిటికల్ హీట్ పెరిగింది. మీరేమి చేశారంటే..మీరేమి చేసారంటే పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. వాస్తవానికి ఇద్దరి హయాంలోనూ పనులు నత్తనడకనే సాగాయనే చెప్పవచ్చు. ఇప్పటికీ బిటిపి, పేరూరు, మడకశిర ఎత్తిపోతల పథకం పనులు పూర్తవలేదు. పూర్తవకపోగా కొత్తగా ఆయా నియోజకవర్గాల నేతల అడగారంటే కొత్తగా శింగనమల, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాలకు సాగునీటిని అందించే విధంగా అనుమతులిచ్చారు. దీని ప్రకారం చూస్తే హంద్రీనీవా ఇచ్చిన అన్నింటనీ నీటిని అందివ్వాలంటే సుమారు 60 టిఎంసిల నీరు రావాల్సి ఉంటుంది. ప్రస్తుతమున్న ప్రకారం 30 టిఎంసిల వరకు నీటిని వస్తోంది. దీనికి కాలువ ప్రవాహ సామర్థ్యం ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించారు. కాని పనులు ముందుకు సాగడం లేదు. ఎక్కడ వేసినగొంగలి అక్కడ అన్న విధంగా మారింది. నీటిని జిల్లాకు తీసుకొచ్చి సద్వినియోగం చేసుకోవడంపై ఇప్పటికీ స్పష్టమైన ప్రణాళికేది లేదు. ఇది లేకపోవడంతో జిల్లా ప్రధాన సమస్య అయిన నీటి సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా మారింది.

## బయో కెమిస్ట్రీలో స్టేట్ టాపర్‌గా సాదియా సంజీర్

### మెడికల్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఆరేపల్లి శ్రీదేవి

**ప్రజాశక్తి-అనంతపురం**



వైద్య విద్యార్థి సాదియాసంజీర్‌ను అభినందిస్తున్న అనంత మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, సిబ్బంది

బయో కెమిస్ట్రీ ప్రధాన విభాగాధిపతి డాక్టర్ దుర్గ మార్గదర్శకంలో డాక్టర్ సాదియా సంజీర్ పోస్టు గ్రాడ్యుయేట్ విద్యను పూర్తి చేసి 75 శాతంపైగా మార్కులతో డిస్టెన్షన్ సంపాదించి గోల్డ్‌మెడల్ సాధించడం గర్వకారణమని అనంత మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి తెలిపారు. ఈమేరకు విద్యార్థినిని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్లు డాక్టర్ కెఎల్.సుబ్రమణ్యం, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ బి.ఆర్ శ్యాంప్రసాద్, జీవ రసాయన శాస్త్ర ప్రధాన విభాగ అధిపతి డాక్టర్ దుర్గ, రేవతి, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ హవీలా, డాక్టర్ శిరీషా, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సంధ్య, డాక్టర్ విద్యాసాగర్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు డాక్టర్ అమూల్య, డాక్టర్ స్రవంతి అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

**ఉరవకొండ :** పుట్టిన వెంటనే పిల్లలకు ముర్రుపాలు పట్టడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని విడపనకల్ వైస్ ఎంపిపి మోదుపల్లి సునీతారాణి రామాంజనేయులు తెలిపారు. శనివారం విడపనకల్ మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమంతోపాటు తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లీబిడ్డల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకే సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లెజెండ్ మోదపల్లి రామాంజనేయులు, అంగన్‌వాడీ సిబ్బంది అరుణకాంతమ్మ, నాగమ్మ, సునీత, మహిళా పోలీసు అనిత, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.4.32 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల : ఎడిఎ ఎం.రవి

**ప్రజాశక్తి-అనంతపురం**



రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ ఎం.రవి

అనుమతులు లేకుండా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రూ.4.32లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు అనంతపురం ఎడిఎ ఎం.రవి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో ఉన్న ఆంజనేయ రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య లిమిటెడ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజార్‌లోని ఎరువుల దుకాణంలో వ్యవసాయ శాఖ అనుమతి లేని ఎరువులను గుర్తించినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో వ్యవసాయ శాఖ అనుమతి లేకుండా ఎరువులు అమ్ముతున్నట్లు గుర్తించి నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ జె.శశికళ, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సొంత ఖర్చులతో హెచ్ఎల్‌సిలో పూడిక, కంపచెట్ల తొలగింపు



జెసిబితో కంపచెట్లను తొలగిస్తున్న రైతులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**

విడపనకల్లు మండలంలోని హెచ్ఎల్‌సి 9వ డిస్ట్రిబ్యూటర్ కాలువల్లో పేరుకుపోయిన పూడికతోపాటు కంపచెట్లను స్థానిక రైతులు సొంత ఖర్చులతో శనివారం తొలగించారు. కాలువ మొత్తం పూడిక, కంపచెట్లతో నిండిపోవడంతో నీటి పారుదలకు అడ్డంకిగా మారింది. దీంతో జి.మల్లాపురం, పాల్తూరు, కలవల్లితిప్ప, హవలిగి గ్రామాలకు చెందిన రైతులు సొంత నిధులు వెచ్చించి పూడిక, కంపచెట్లను తొలగించారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనిని రైతులే సొంత నిధులు వెచ్చించి తొలగించుకోవడం బాధాకరమని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హెచ్ఎల్‌సికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి-ఉరవకొండ**



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల కోదండరామిరెడ్డి

వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు ఉషశ్రీచరణ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విన్నవించారు. ఈమేరకు శనివారం జిల్లాకేంద్రంలో మంత్రులను మర్యాదపూర్వం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఇందుకు మంత్రులు స్పందించి సమస్యను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.





## జనసేన బలోపేతానికి కృషి

**ప్రజాశక్తి-బెలుగుప్ప**

జనసేన పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు నడుం బిగించాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్‌కుమార్, మండల అధ్యక్షులు కాసంశెట్టి సుధీర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జన ఘోష, జనసేన భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బాలోపేతం చేయడమే లక్ష్యంగా జనఘోష - జనసేన భరోసా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల అధ్యక్షులు చంద్రశేఖర, విడపనకల్ మండల అధ్యక్షులు టి.గోపాల్, కూడేరు మండల అధ్యక్షులు నాగేష్, బెళుగుప్ప మండల ఉపాధ్యక్షులు మధు, రామంజి, ప్రధాన కార్యదర్శులు నాని, మోహన్, నాయకులు మంజు, మురళి, మణి, మల్లికార్జున, శేఖర్, రవినాయక్, భోగేష్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

**గుత్తి :** మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో తాగునీటి సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుక్కెడు నీటి కోసం ప్రజల అవస్థలు పడుతుంటే ప్రజా ప్రతినిధులు అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు చేపట్టినా స్పందన కరువైందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, టిడిపి మండల కన్వీనర్ బర్దీవలి, నాయకులు దిల్కాశీనా, వేణు, అందాల వెంకటరాముడు శ్రీకాంత్ చౌదరి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు పూలమాబు, డానియల్, నరసింహా, రామకృష్ణ, రాజు, మహమూదా తదితరులు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల పరిశీలన ముసుగులో అల్లర్లకు కుట్ర

### మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

**ప్రజాశక్తి-ఉరవకొండ**



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో ప్రాజెక్టుల పరిశీలన ముసుగులో అల్లర్లు సృష్టించేందుకు టిడిపి అధినేత చంద్రబాబు పూనుకున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. శనివారం విడపనకల్లు మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుల,మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాలుగేళ్లుగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో రాజకీయ లబ్ధి కోసం టిడిపి అధినేత చంద్రబాబు ప్రాజెక్టుల పరిశీలన పేరుతో అల్లర్లు సృష్టించేందుకు పూనుకున్నారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఇలాంటి ఘర్షణలకు పూనుకున్నారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు తన కుటిల రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు, వైస్ ఎంపిపి మోదుపల్లి సునీతారాణి రామాంజనేయులు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ ఈరమ్మ, ఇఒఆర్‌డి సత్యబాబు, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేశులు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే సమావేశానికి సమస్యలు పరిష్కరించాలి

### సర్వసభ్య సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిపి రామిరెడ్డి

**ప్రజాశక్తి-పెద్దపప్పూరు**



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపిపి రామిరెడ్డి

వచ్చే సమాశానికి ఆయా శాఖ అధికారులు సమస్యలను పరిష్కరించి హాజరుకావాలని ఇన్‌ఛార్జి ఎంపిపి రామిరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రామకృష్ణ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వైద్యులు కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం కల్లకలక వైరస్ వ్యాప్తి చెందుతోందని, అయితే ఎంత త్వరగా వ్యాపిస్తే అంత త్వరా వెళ్లిపోతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. వ్యవసాయ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా సాగు చేసిన పంటలను ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. హౌసింగ్ ఎఇ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకునేందుకు నాయకులు అవగాహన కల్పించాలని కోరారు. ఇకపోతే పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఇందుకు స్పందించిన ఇన్‌ఛార్జి ఎంపిపి ఆయా శాఖల అధికారులు వచ్చే సమావేశానికి ఈ సమావేశంలో సభదృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కళావతి, ఉద్యాన అధికారిణి ఉమాదేవి, వెలుగు ఎపిఎం రవిచంద్రరాజు, ఎంఇఒ శ్రీదేవి, ఐసిటీసీ సూపర్‌వైజర్ నారాయణమ్మ, రామలక్ష్మి, సర్పంచు రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 7న చలో కలెక్టరేట్

**ప్రజాశక్తి-గుత్తి**



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.నాగభూషణం

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 7వ తేదీన చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు అనుబంధ సంస్థ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు అనారోగ్యానికి గురైతే సాధారణ సెలవులు మంజూరు చేయడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీ కార్మికులను నియమించుకున్నందుకు అనుమతి ఉన్నా గుత్తిలో మాత్రం నియమించుకునేందుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిపిఎఫ్, ఇఎస్ఐలు అమలు చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుత్తి మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సంఘం అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి కె.బాలరంగన్న, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజా, మురళి, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే లక్ష్యం

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి
### రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ

**ఒప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**



రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీచరణ్, కలెక్టర్ గౌతమి, తదితరులు

దేశానికి వెన్నెముకగా ఉన్న రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషా శ్రీ చరణ్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరే ట్ ప్రాంగణంలో ఉద్యాన వన శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ సాగునీటి పథకం కింద కళ్యాణదుర్గం, గుంతకల్ నియోజకవర్గం రైతులకు మంజూరైన డ్రిప్, స్పింకర్లను, యంత్రాలను మంత్రులతోపాటు కలెక్టర్ ఎమ్.గౌతమి, విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, వై.వెంకటరామి రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గం పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో తొలి విడతగా 223 మంది రైతులకు చెందిన 306 హెక్టార్లకు సంబంధించి రూ.2.59 కోట్లు విలువ చేసే డ్రిప్ పరికరాలను రూ.2.12 కోట్ల సబ్సిడీతో ప్రభుత్వం అందిస్తోందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 1,934 మంది రైతులకు సంబంధించి 2,696 హెక్టార్లకు గాను రూ.19.86 కోట్లు విలువ చేసే డ్రిప్ పరికరాలను రూ. 16.03 కోట్లు సబ్సిడీతో అందించామన్నారు. గుంతకల్ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలివిడత గా 173 మంది రైతులకు చెందిన 198 హెక్టార్లకు సంబంధించి రూ.1.96 కోట్లు విలువ చేసే డ్రిప్ పరికరాలను రూ. 1.55 కోట్ల సబ్సిడీతో అందజేశామని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 784 రైతులకు చెందిన 919.45 హెక్టార్లకు సంబంధించి రూ.6.92 కోట్లు విలువ చేసే పరికరాలను రూ.5.33 కోట్లు సబ్సిడీతో అందించామన్నారు. రైతులు సబ్సిడీతో అందించిన డ్రిప్ పరికరాలను ఉపయోగించుకోవాలన్నారు. మంత్రి ఉషాశ్రీచరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రైతులకు ప్రతిదశలోనూ అండగా ఉంటున్నారన్నాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాసరావు, మడకశిర ఎమ్మెల్యే తిప్పే స్వామి, అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్ జైన్, ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, ఆర్డీవో మధుసూదన్, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, ఎపిఎంఐపి పీడీ ఫిరోజ్ ఖాన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.గూడూరులో పోలీస్ పికెట్

**పుట్లూరు :** మండలంలోని ఎస్.గూడూరు గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. గతనెల 30న మొహరం వేడుకల సందర్భంగా అగ్రకులాలు, ఎస్సీల మధ్య జరిగిన ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే పోలీసులు ఇరుర్గాలను వేర్వేరుగా విచారించి శాంతంగా ఉండాలని సూచించారు. అయితే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పుట్లూరు సిఐ వేణుగోపాల ఆధ్వర్యంలో ఇద్దరు ఎస్ఐలు, 30 మంది పోలీసు సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేశారు.

## పుట్లూరు ఎస్ఐగా దిలీప్‌కుమార్

**పుట్లూరు :** పుట్లూరు ఎస్ఐగా దిలీప్‌కుమార్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటప్రసాద్ నంద్యాలకు బదిలీ అయ్యారు. దీంతో అనంతపురం స్పెషల్ బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్న దిలీప్‌కుమార్‌ను ఎస్ఐగా నియమించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఏమన్నా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అలాకాకుండా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## లీజుకు ఆర్టీసీ స్థలం

**అనంతపురం :** అనంతపురం ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణలో రీజినల్ మేనేజర్ కార్యాలయానికి ఉత్తర దిశగా ఉన్న ఖాళీ స్థలాలను లీజుకు ఇవ్వనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ వద్ద వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా లీజు పరిమితి, దరఖాస్తు చేసుకునే విధానాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కడప ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు, అధికారులు పి.రమేష్‌బాబు, జి.మోహన్‌కుమార్, సురేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ

**రాయదుర్గం రూరల్ :** మండల పరిధిలోని వద్ర వన్నూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిడిఒ కొండయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేపరాల సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు.

## ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

**బొమ్మనహాల్ :** అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పన్నీటి స్నానాలు ఆచరించారు. అనంతరం సువర్ణ కిరీటం, వెండి కవచం అలంకరించి తమలపాకుల పూజ చేశారు. తర్వాత వేదమంత్రాలతో కుంకుమ అర్చనలు, అభిషేకాలు చేసినట్లు అర్చకులు అనిల్‌స్వామి తెలిపారు. కాగా స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదం ఏర్పాటు చేసినట్లు అన్నదాన కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు తెలిపారు.

## పోషకాహారం కిట్లు పంపిణీ

**గుత్తి :** మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో బాలింతలు, గర్భిణులకు శనివారం పోషకాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఎ.వెంకటేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 'శ్రీచైతన్య'లో స్నేహితుల దినోత్సవం

**అనంతపురం :** నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ రామాయణ భారత కాలం నుంచి నేటి వరకూ స్నేహానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. స్నేహం వల్ల మనకి ఎంతో భరోసా దొరుకుతుందన్నారు. తల్లిదండ్రులతో పంచుకోలేని ఎన్నో అనుభూతులు, జ్ఞాపకాలను స్నేహితులతో పంచుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పర్వీన్, డీన్ చంద్రమోహన్, ప్రైమరీ ఇన్‌ఛార్జి మాధవి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి కోమలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిజాలను నిర్భయంగా చెప్పండి : మాజీమంత్రి కాలవ

**రాయదుర్గం :** వాస్తవాలను ప్రజలకు తెలియపర్చడంలో టిడిపి సోషల్ మీడియా ప్రధాన పాత్ర పోషించాలని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి పెటిఎం బ్యాచ్ చేస్తోన్న అసత్య ప్రచారాలు, ఆరోపణలను సమర్థంగా తిప్పికొట్టాలన్నారు. విప్ కాపు రామచంద్రారెడ్డి అవినీతి, అక్రమాలను సోషల్ మీడియా వేదికగా నిలదీయాలన్నారు. నాలుగేళ్లలో కాపు రామచంద్రారెడ్డి అక్రమార్జనే ధ్యేయంగా కోట్లు సంపాధించాడన్నారు. ముఖ్యంగా వేదవతి, హగరి నదుల్లో అక్రమంగా ఇసుక, రాత్రిళ్లు కర్ణాటకకు తరలిస్తున్నాడన్నారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో సోషల్ మీడియా కార్యకర్తలు టిడిపి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐ టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి.వి.ఎస్ మారుతి, నియోజకవర్గ ఐ టిడిపి అధ్యక్షుడు మోహన్‌రాజ్, నియోజకవర్గ ఆర్‌టిఎస్ అధ్యక్షులు కృష్ణ, మండల ఐ టిడిపి అధ్యక్షులు కుమార్ పాల్గొన్నారు.

## కంప్యూటర్లు, నోట్ పుస్తకాల వితరణ

**బ్రహ్మసముద్రం :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు సిట్రిక్స్ కంపెనీ ఉద్యోగులు శనివారం కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, నోట్ పుస్తకాలు తదితర సామగ్రిని అందజేశారు. మండలంలోని ముద్దలాపురం పూర్వవిద్యార్థులు వై.టి.రామాంజనేయులు ఆధ్వర్యంలో పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం సహకారం అందిస్తున్న హైదరాబాదులోని సిట్రిక్ కంపెనీలో పని చేస్తున్న మిత్రబృందం పదేళ్లుగా విద్యార్థులకు బోధనోపకరణాలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిట్రిక్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం : ఎపిటిఎఫ్

**శెట్టూరు :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల వెంకటేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఎపిటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దాసరి మురళిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మయ్య, బి.వెంకటేషులు, రామ్మోహన్, మండల కమిటీ సభ్యులు ఎర్రిస్వామి, ఈరన్న, శ్రీనివాసులు, రవి, కృష్ణ, షాషావలి, సిద్ధార్థ, వీరభద్ర, నగేష్ పాల్గొన్నారు.

## ఇల్లు నిర్మించుకోకపోతే పట్టా రద్దు

**బుక్కరాయసముద్రం :** లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోకపోతే ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాలను రద్దు చేస్తామని తహశీల్దార్ రమాదేవి హెచ్చరించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించాలని ఉద్దేశంతో మండలం వ్యాప్తంగా స్థలం లేని నిరుపేదలకు పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. వీరిలో కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారని, మరికొందరు నిర్మించుకోలేదన్నారు. కావున అక్టోబర్ నెలలోపు అందరూ ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. ఇళ్ల నిర్మాణంలో ఆర్థికంగా ఇబ్బంది ఉన్నవారికి ఐకెపి, డిఆర్‌డిఎ, వెలుగు సంఘాల ద్వారా రూ.లక్ష వరకూ రుణం మంజూరు చేయనున్నట్లు ఎపిఎం మద్దిలేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్ మండల హౌసింగ్ ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి దితరులు పాల్గొన్నారు .

## నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి : డిఎఫ్ఒ

**అనంతపురం :** విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని డిఎఫ్ఒ వి.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని ది ట్రెల్లిస్ పాఠశాలలో ఇన్వెస్టిట్యూర్ సెరిమోనీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం అగ్ని భద్రతపై అవగాహన కల్పించారు. పాఠశాల ఛైర్మన్ శ్రీకాంత్ వద్ద మాట్లాడుతూ నాయకత్వ పాత్రల్లో నిమగ్నమవ్వడం, విద్యార్థి నాయకులు నిర్ణయం తీసుకోవడం, సమస్య-పరిష్కారం, సానుకూల పాఠశాల సంస్కృతిని పెంపొందించడంలో అమూల్యమైన అనుభవాలను పొందాలని సూచించారు. అనంతరం చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యాజమాన్య కమిటీ సభ్యురాలు అమిత ప్రియ, ప్రధానోపాధ్యాయురాలు డి.భార్గవి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.